

పారామెడికల్ కోర్సుల్లో ఉచిత అడ్మిషన్లు

శ్రీకాకుళం రూరల్ : బొల్లినేని మెడ్‌స్కిల్స్ (జెమ్స్)లో బిఎస్‌సి పారామెడికల్ కోర్సుల్లో ఉచిత అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో తమ సంస్థలోనే ఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. బిఎస్‌సి ట్రాన్స్‌ఫిషన్ టెక్నాలజీ, రేడియోథెరపీ టెక్నాలజీ, ఫిజీషియన్ అసిస్టెంట్ టెక్నాలజీ, కార్డియాక్ కేర్, ఫెర్ఫిషన్, రేడియాలజీ, ఆప్టోమెట్రీ, న్యూరో ఫిజియాలజీ, డయాలసిస్, రెస్పిరేటరీ, మెడికల్ రికార్డ్స్ టెక్నాలజీ తదితర కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఇంటర్ బైపిసి పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 7995013422, 9121999654 ఫోన్ నంబర్లను గానీ రాగోలులోని జెమ్స్ క్యాంపస్‌లో గానీ సంప్రదించాలని సూచించారు.



సుగర్స్... రివర్స్

ఆమదాలవలస సుగర్ ఫ్యాక్టరీని సహకార రంగంలో తెరిపించాలన్న ఉద్దేశం అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు ఉన్నట్లుగా కనిపించడం లేదు. సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని 2019 ఎన్నికల్లో హామీనిచ్చిన వైసిపి ఇప్పటివరకు దాని ఊసే ఎత్తడం లేదు. అధికారంలోకి వచ్చిన తర్వాత నిపుణుల కమిటీ ఏర్పాటు, ఫ్యాక్టరీ స్థల పరిశీలన పేరుతో కొంత హడావుడి చేసినా ఆ తర్వాత దాని జోలికి వెళ్లలేదు. పైగా ఫ్యాక్టరీ భూములు వేటికి అనువుగా ఉంటాయో అప్పటి జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు 2021లో లేఖ రాయడం ప్రభుత్వం అసలు ఉద్దేశాన్ని బట్టబయలు చేసింది. అధికార వైసిపి హామీపై నిలదీయాల్సిన టిడిపి ఆ పని చేయకపోగా, యూటర్న్ తీసుకున్నట్లుగా కనిపిస్తోంది. ఫ్యాక్టరీ స్థలంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటూ ఇటీవల శంఖారావం సభలో కొత్త రాగం అందుకుంది.

- బయటపడుతున్న వైసిపి, టిడిపి వైఖరి
- భూములు వేటికి అనువుగా ఉంటాయో తెలపాలంటూ కలెక్టర్‌కు లేఖ
- ఫ్యాక్టరీ స్థలంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటూ టిడిపి కొత్త రాగం
- మరో పోరాటమే మార్గమంటున్న రైతాంగం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఆమదాలవలస సుగర్స్ అంశంపై టిడిపి యూటర్న్ తీసుకున్నట్లు కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో సుగర్స్‌కు ప్రత్యామ్నాయంగా ఆ స్థలంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నది టిడిపి కొత్త అజెండాను ఎంచుకుంది. సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో హామీనిచ్చి నేటికీ తెరిపించలేదంటూ ఆమదాలవలసలో ఈనెల 13న నిర్వహించిన శంఖారావం సభలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ప్రస్తావించారు. శంఖారావం సభలు నిర్వహించిన ఆయా నియోజకవర్గాల్లో వైసిపి హామీనిచ్చి విస్మరించిన అంశాలను తాము అమలు చేస్తామని చెప్పిన లోకేష్, ఇక్కడ రేఖామాత్రంగానైనా చెప్పలేదు. ఫ్యాక్టరీ తెరవకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాట తప్పి మడమ తిప్పారంటూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కూన రవికుమార్ విమర్శిస్తూనే, సుగర్ ఫ్యాక్టరీ స్థానంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలంటూ చెప్పుకొచ్చారు. తద్వారా సుగర్ ఫ్యాక్టరీ విషయంలో టిడిపి వైఖరేమిటో తేటతెల్లమైంది.

ప్రభుత్వ వంచన

సుగర్ ఫ్యాక్టరీ విషయంలో ప్రభుత్వం ఇప్పటివరకు అనుసరించిన వైఖరిని గమనించిన టిడిపి, తనూ అదే దారిలో వెళ్తే జనం ఎవరికో ఒకరికి ఓటేయక మానరని భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఆమదాలవలస నియోజకవర్గానికి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న తమ్మినేని సీతారాం సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని 2019 ఎన్నికల్లో హామీనివ్వడంతో ఆ ప్రాంత ప్రజలు, రైతులు ఆదరించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2020, ఫిబ్రవరి రెండో తేదీన ఆ ప్రాంతాన్ని నిపుణుల కమిటీ సందర్శించి, యంత్రాల పరిశీలనతో పాటు రైతులతో కమిటీ సభ్యులు మాట్లాడారు. తామంతా చెరుకు పండించడానికి సిద్ధంగా ఉన్నట్లు వారు కమిటీ ముందు స్పష్టంగా చెప్పారు. దీంతోపాటు ఫ్యాక్టరీని తెరిపించాలంటూ లక్ష సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కమిటీ పర్యటించి నాలుగు గడిచినా దానికి అతీగతీ లేకుండా పోయింది. ఆ తర్వాత 2021 నవంబరులో అప్పటి కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు రాసిన లేఖ ప్రభుత్వం అసలు ఉద్దేశాన్ని బట్టబయలు చేసింది.

పరిశ్రమకు సంబంధించి ఏవైనా న్యాయపరమైన చిక్కులు ఉన్నాయా?, పరిశ్రమను తెరవాలంటూ నిరంతరం ఆ ప్రాంతంలో ఉద్యమాలు ఏమైనా జరుగుతున్నాయా వంటి అంశాలపై తనిఖీ చేసి నివేదిక పంపాలంటూ లేఖలో పేర్కొన్నారు. అదేవిధంగా భూముల విలువ, పారిశ్రామిక, వాణిజ్య, నివాసయోగ్యం కేటగిరీల్లో వేటికి అనువుగా ఉంటాయో సరైన సూచనలు చేయాలంటూ కోరారు. కోర్టు కేసుల వివరాలు, భూముల విలువ వంటి అంశాలతో పాటు ప్రస్తుతానికి ఆ ప్రాంతంలో ఎటువంటి ఆందోళనలు జరగడం లేదంటూ ఆ నెలలోనే కలెక్టర్ నివేదిక పంపారు. సుగర్ ఫ్యాక్టరీని తెరిపించే ఉద్దేశం లేకే ప్రభుత్వం ఈ వివరాలన్నీ అడిగిందంటూ అప్పట్లో రైతుల్లో కొంత చర్చ సాగింది.

రెండు దశాబ్దాలుగా మోసపోతున్న రైతులు

సుగర్ ఫ్యాక్టరీ విషయంలో కాంగ్రెస్ పార్టీ కూడా తక్కువేమీ తినలేదు. పాదయాత్ర సందర్భంగా 2003లో ఈ ప్రాంతానికి వచ్చిన కీ.శే వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామంటూ హామీనిచ్చారు. కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన బొడ్డేపల్లి సత్యవతిని ప్రజలు ఆదరించారు. ఆ తర్వాత ఓ సందర్భంలో వైఎస్ ఆ అంశాన్ని ప్రస్తావిస్తూ, పెళ్లి చేసి అత్తారింటికి పంపేసిన తర్వాత ఆడపిల్లను తిరిగి తెచ్చుకోవడం సాధ్యమవుతుందా అంటూ నాడు చెప్పిన మాటలతో తొలిసారి రైతులు మోసపోయారు. ఇక అక్కడ నుంచి పాలక పార్టీల వంచనకు గురవుతూనే ఉన్నారు.

ఈ నేపథ్యంలో సుగర్స్‌పై మరో ఉద్యమం చేపట్టడమే రైతుల ముందు ప్రత్యామ్నాయంగా ఉంది. ఆమదాలవలస సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ 2007 నుంచి 2014 మధ్య కాలంలో పాదయాత్రలు, రిలే నిరాహార దీక్షలు వంటి రూపాల్లో నిరంతరం ఆ అంశాన్ని ప్రజల మధ్య చర్చగా ఉంచింది. ప్రధాన రాజకీయ పార్టీలు సైతం దీనిపై మాట్లాడాల్సి వచ్చింది. ఇదే అంశం ఎన్నికల అజెండాగా మారింది. 2014, 2019 ఎన్నికల్లో టిడిపి, వైసిపిలు ఇదే హామీతో నెగ్గాయి. రైతులు నాటి పోరాట స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో సుగర్స్ అంశాన్ని ప్రధాన అజెండా మార్చాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అందుకు అందరూ అన్నదాతలకు అండగా నిలవాల్సిన తరుణం ఆసన్నమైంది.



లెనిన్ సాహిత్యాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

కమ్యూనిస్టు ప్రణాళిక దిక్సూచి

- మార్క్సిజంతోనే మానవాళికి విముక్తి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు
- రెడ్ బుక్ డేలో లెనిన్ సాహిత్య పుస్తకాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ మానవాళి విముక్తికి మహోన్నత సిద్ధాంతం మార్క్సిజమేనని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు జి.సింహాచలం అన్నారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో రెడ్ బుక్ డేను బుధవారం నిర్వహించారు. సిఐటియు సీనియర్ నాయకులు కె.శ్రీనివాసు అధ్యక్షతన నిర్వహించిన సభలో లెనిన్ సాహిత్యం ఏడు పుస్తకాల సెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1848 ఫిబ్రవరి 21న 50 పేజీల కమ్యూనిస్టు ప్రణాళిక మానవాళికి దిక్సూచిగా ఉందన్నారు. విముక్తి కోసం మహోన్నత సిద్ధాంతాన్ని మార్క్స్, ఏంగిల్స్ అందిస్తే, లెనిన్ దాన్ని అప్పటి నిర్దిష్ట పరిస్థితుల్లో తన ఆలోచన చేర్చి ఆచరణలో పెట్టి ప్రపంచంలోనే మొట్టమొదట సామ్యవాద కల సాకారం చేశారని చెప్పారు. పెట్టుబడిదారీ పాలనలో ప్రజల సమస్యలు పరిష్కారం కావని, ప్రజలను దోపిడీ చేయడమే దాని లక్ష్యమన్నారు.

బడా పెట్టుబడిదారులు దేశంలో కొండలు, గుట్టలు, నదులు, భూములు ప్రకృతి సంపదను ఎలా లూటీ చేస్తున్నారో కళ్లెదుట కనిపిస్తోందని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకృతి సంపదను, ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మద్దతు పలుకుతూ ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. కార్పొరేట్ పాలనలో కార్పొరేట్ ప్రయోజనాలు తప్ప ప్రజల ప్రయోజనాలు నెరవేరవన్నారు. మరో ప్రపంచం ఉందని, దానికోసం పెద్దఎత్తున ప్రజా పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు కె.నాగమణి, పి.తేజేశ్వరరావు, వి.జి.కె మూర్తి, ఎస్.ప్రసాద్, ఎం.సత్యం, ఎం.గోవర్ధనరావు, జి.ఈశ్వరమ్మ, డి.భానుమతి తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : వజ్రపుకొత్తూరులో ఎన్.చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన రెడ్ బుక్ డేను నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.మోహనరావు, బి.ఆనందరావు, బి.సుగుణావతి, టి.భాస్కరరావు, బి.రామకృష్ణ, బి.లక్ష్మి, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు చర్యలు

ఎస్‌పి జి.ఆర్ రాధిక




ప్రజాశక్తి - పొందూరు

నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. పొందూరు పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్టేషన్ లోపల ప్రాపర్టీ భద్రపరచే గదిని సందర్శించి కేసుల ప్రాపర్టీ వివరాలపై ఆరా తీశారు. ముఖ్యమైన కేసుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి దర్యాప్తు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో సందర్శించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ముందుస్తు చర్యలు చేపట్టాలని ఎస్ఐ రవికుమార్‌కు సూచించారు. ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమ రవాణాను, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రివేళలో గస్తీపై మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

23 నుంచి 'పది' ప్రీ ఫైనల్ పరీక్షలు

ప్రజాశక్తి - టెక్కలి

విద్యా సంవత్సరం ముగింపు దశకు వచ్చి పరీక్షల సీజన్ ప్రారంభమవుతుంది. ఈనెల 23వ తేదీ నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు మొదలు కానుండగా, ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఎఫ్-4 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యాన నిర్వహించే పరీక్షలకు టైమ్ టేబుల్‌ను విడుదల చేశారు. ప్రతిరోజూ రెండో పూట పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈసారి భౌతిక, రసాయనిక, జీవశాస్త్రాలకు వేర్వేరుగా పరీక్షలు జరగనున్నాయి. 50 మార్కులకు పరీక్షా ప్రశ్నాపత్రం ఉండడంతో గంటన్నర సమయాన్ని మాత్రమే కేటాయించారు. ఈసారి పరీక్షలను విద్యార్థులు పుస్తకాలపై రాయనున్నారు.





ఎన్నికల ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబరు

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సాధారణ ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం కలెక్టరేట్‌లో 1950 టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఈ నంబరును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో 34వ వారపు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నిర్వహించే సాధారణ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 1950, 18004256625 టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి ఫిర్యాదులనైనా ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి గానీ apmip-sklm@gmail.comకి మెయిల్ చేసి ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. ప్రత్యేకంగా నియమించిన నోడల్ అధికారి ఆధ్వర్యాన ప్రతిరోజూ ఉదయం పది నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ వ్యవస్థ పనిచేస్తుందని చెప్పారు. కంట్రోల్‌రూమ్‌కు వచ్చిన ఫిర్యాదులను సిబ్బంది ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేసుకుంటారని తెలిపారు. జిల్లా ప్రజలు, ఓటర్లు, రాజకీయ పార్టీలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. నెల రోజులుగా 2,66,194 నూతన ఓటరు కార్డులు ముద్రణ కోసం పంపామని, వీటిలో 1,08,836 కార్డులు ముద్రణ పూర్తి కాగా, పోస్టల్ ద్వారా ఓటర్ల ఇళ్లకే చేరవేశామని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. సమావేశంలో ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు, వైసిపి నాయకులు రౌతు శంకరరావు, టిడిపి నాయకులు పి.ఎం.జె బాబు, కాంగ్రెస్ నాయకులు డి.మల్లిబాబు, బిజెపి నాయకులు సురేష్‌బాబు సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష నేర్చుకోవాలి

ఎచ్చెర్ల : మాతృభాషలోనే విద్యార్థులు ప్రాథమిక విద్యాభ్యాసం చేయాలని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వి.జి.డి బాలాజీ సూచించారు. అవసరార్థం ఇతర భాషలు నేర్చుకోవాలన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటిలో తెలుగు శాఖ ఆధ్వర్యాన అంతర్జాతీయ మాతృభాషల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ విశ్రాంత ఆచార్యులు పర్వతనేని సుబ్బారావు మాట్లాడుతూ తెలుగు భాషకు వెయ్యేళ్ల చరిత్ర ఉందన్నారు. రెండో శతాబ్దం నాటికే తెలుగు భాషా సాహిత్యాలు ఉన్నాయని తెలిపారు. మాతృభాషలోనే తమ భావాలను స్పష్టంగా వ్యక్తం చేయగలరని చెప్పారు. ట్రిపుల్ ఐటి ఎఒ ముని రామకృష్ణ మాతృభాషా దినోత్సవ విశిష్టతను వివరించారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ సహాయ ఆచార్యులు కె.ఉదయకిరణ్ మాట్లాడుతూ తెలుగు భాష పూర్వ వైభవానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, డీన్ మోహనకృష్ణ చౌదరి, ఎఫ్ఒ అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ జి.రవికుమార్, తెలుగు శాఖ అధ్యక్షులు చిరంజీవిరావు, ఆర్.గణపతిరావు, పి.ముకుందరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



3న పల్స్ పోలియో

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మార్చి మూడో తేదీన పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తెలిపారు. నగరంలోని డిఎంహెచ్ఒ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వైద్యాధికారుల శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్స్ పోలియోను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి వైద్యాధికారి తమ పరిధిలోని పోలింగ్ బూత్‌పై సిబ్బందికి అవగాహన పెంపొందించాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ సూపర్‌వైజర్లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి పల్స్ పోలియోపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. జిల్లాలో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ చుక్కల మందు తప్పనిసరిగా వేయించాలన్నారు. మొబైల్ టీమ్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అన్ని సంచార జాతుల పిల్లలకు, ఇటుక బట్టీలు, పళ్లతోటల్లో నివాసముంటున్న పిల్లలకు శత శాతం పోలియో చుక్కలు వేసి పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లాలో 0 నుంచి ఐదేళ్ల మధ్య వయసు గల పిల్లలు 2,33,823 మంది ఉన్నారని, వారందరికీ పోలియో చుక్కలు వేయాలని చెప్పారు. 1634 పోలింగ్ బూత్‌లు, ట్రాన్సిట్ బూత్‌లు 50, మొబైల్ బూత్‌లు 98, సూపర్‌వైజర్ల టీమ్ 160గా నిర్ణయించినట్లు తెలిపారు. వైద్య సిబ్బందితో పాటు అంగన్వాడీలు, పంచాయతీరాజ్ సిబ్బంది, ఉపాధ్యాయులు సమన్వయంతో శతశాతం పోలియో చుక్కలు వేయించాలన్నారు. సమావేశంలో డిఐఒ ఈశ్వరీదేవి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ పి.ప్రకాశరావు, సుజాత, వెంకటలక్ష్మి, ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వరరావు, మోహిని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లా కోర్టులోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేసేందుకు ప్రతిరోజూ శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు జ్ఞాన సువర్ణరాజు ఆధ్వర్యాన ప్రీ లోక్ అదాలత్ సెట్టింగ్స్ నిర్వహిస్తారని తెలిపారు. రాజీపడిన దగిన క్రిమినల్, మోటారు ప్రమాద కేసులు, అన్నిరకాల సివిల్ కేసులోని కక్షిదారులు ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్ ఉపయోగించుకుని రాజీ చేసుకోవాలని కోరారు. ఇరుపక్షాల వారిని సమన్వయపరిచి రాజీకి సంసిద్ధులను చేస్తారని చెప్పారు. ప్రీ లోక్ అదాలత్ సెట్టింగ్స్ ప్రతిరోజూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో ఉన్న శాశ్వత లోక్ అదాలత్ కార్యాలయంలో జరుగునని తెలిపారు. సమావేశంలో శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు జ్ఞాన సువర్ణరాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

నైపుణ్యాభివృద్ధితో ఉపాధి అవకాశాలు

రెవెన్యూ మంత్రి ధర్మాన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యార్థి దశలోనే నైపుణ్యాభివృద్ధిని పెంచుకుంటే మెరుగైన ఉపాధి అవకాశాలు దక్కించుకోగలరని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న స్కిల్ క్వెస్ట్ (ఎంటర్, ఎక్స్‌ప్లోర్, ఎర్న్) స్టాల్స్‌ను బుధవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ శ్రేణిలో నిలిపేందుకు అధ్యాపకులు కృషి చేస్తున్నారని కొనియాడారు. సరైన ఆలోచన, శిక్షణ ఉన్నప్పుడే పోటీలను తట్టుకుని మెరుగైన ఫలితాన్ని అందుకోగలరన్నారు. పెరుగుతున్న జనాభా వల్ల ఉపాధి, ఉద్యోగాల కొరత ఏర్పడుతోందని, ఇటువంటి సమయంలో ప్రైవేటు ఉద్యోగాల్లో రాణించేందుకు విద్యార్థులు సంసిద్ధులు కావాలన్నారు. జీవితాన్ని తీర్చిదిద్దుకునేందుకు ప్రాక్టికల్ నాలెడ్జి అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, వైసిపి నాయకులు సాధు వైకుంఠరావు, సురంగి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు

పోలింగ్ కేంద్రాలు తనిఖీ

పలాస : కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ బుధవారం పరిశీలించారు. పలాస ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ, స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పలాస తహశీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయాన్ని సందర్శించి ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో జాప్యంపై అధికారులను ప్రశ్నించారు. కిడ్నీ పరిశోధనా కేంద్రం, 200 పడకల ఆస్పత్రిని పరిశీలించి అందిస్తున్న వైద్య సేవలు, సమస్యలపై ఆస్పత్రి సూపరింటెండెంట్ అల్లు పద్మజను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి రక్షణ గోడ లేదని, పూర్తిస్థాయిలో పరికరాలు, వైద్యులు లేరని, శ్రీకాకుళం నుంచి కొంతమంది వైద్యులు డెప్యుటేషన్‌పై వస్తున్నారని తెలిపారు. పూర్తి వివరాలను నివేదిక రూపంలో అందించాలని కలెక్టర్ చెప్పారు. కాశీబుగ్గలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి మున్సిపాల్టీ పరిధిలో టిడ్కో ఇళ్లు, జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు చేయడంలో జాప్యానికి గల కారణాలను మున్సిపల్, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులకు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండలం వెనుకబడి ఉందని, త్వరితగతిన రిజిస్ట్రేషన్లు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌డిఒ భరత్ నాయక్, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, తహశీల్దార్ ఎస్.వి.వి.ఎస్ నాయుడు తదితరులున్నారు.



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



టెక్కలి రూరల్ : ఎన్నికైన నూతన కార్యవర్గం

విద్యుత్ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- పలాస

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ పలాస బ్రాంచ్ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం నిర్వహించారు. రానున్న రెండేళ్లకు నూతన కార్యవర్గ ఎన్నిక నరసన్నపేటలో స్టేట్ జనరల్ సెక్రెటరీ ఎం.వి.గోపాలరావు అధ్యక్షతన నిర్వహించారు. కమ్యూనికేషన్ రాష్ట్ర సెక్రెటరీ ఎం.ప్రభాకరావు ఎన్నికల అధికారిగా, ముఖ్య అతిథిగా ఆర్.రాజేశ్వరరావు పాల్గొన్నారు. పలాస బ్రాంచ్ నూతన అధ్యక్షులుగా కొమ్మల గిరీశ్వరరావు, కార్యదర్శిగా గార రాజారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.పానిగ్రహి, కోశాధికారిగా మెట్ట హిమగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.రామచంద్రుడు, ఆఫీస్ సెక్రటరీగా ఎస్.అప్పలకొండ, కమ్యూనికేషన్ సెక్రెటరీగా ఎస్.భాస్కరరావు, ఇరత కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

టెక్కలి రూరల్ : ఎపి ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 టెక్కలి బ్రాంచ్‌కు వచ్చే రెండేళ్లకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నరసన్నపేటలో స్టేట్ జనరల్ సెక్రెటరీ ఎ.వి.గోపాలరావు అధ్యక్షత వహించారు. కమ్యూనికేషన్ రాష్ట్ర సెక్రెటరీ ఎం.ప్రభాకరరావు ఎన్నిక అధికారిగా వ్యవహరించారు. టెక్కలి బ్రాంచ్ అధ్యక్షులుగా దాసరి శేఖర్, కార్యదర్శిగా నక్క లోకేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అన్నెపు గోపాలరత్నం, కోశాధికారిగా మెట్ట హిమగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఈశ్వరరావు, ఆఫీస్ సెక్రటరీగా మెట్ట కరుణాకర్, కమ్యూనికేషన్ సెక్రెటరీగా వై.వాసుదేవరావులను ఎన్నుకున్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

శ్రీకాకుళం : జిల్లా రోడ్ల, భవనాలశాఖ ఆధ్వర్యాన ఇనస్పెక్షన్ బంగ్లాలో వ్యాచ్‌మేన్, సానిటరీ వర్కర్లు, అటెండర్లుగా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు వెబ్‌సైట్ www.srikakulam.ap.gov.inలో పొందుపరిచామన్నారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పర్యవేక్షణ ఇంజినీర్ సర్కిల్, సాయిబలతోట, పిఎస్ఎన్ఎంహెచ్ స్కూల్ దగ్గర శ్రీకాకులంలో దరఖాస్తులను సమర్పించాలన్నారు.

రాష్ట్రపతికి లక్ష ఉత్తరాలు

ప్రజాశక్తి- రణస్థలం

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న పత్రికా రంగంపై ఎపిలో ఇటీవల భౌతికదాడులు పెరుగుతుండడం తనకు ఆందోళన కలిగిస్తుందని, ఇకపై ఇటువంటి భౌతిక దాడులు జరగకుండా పత్రికా రంగాన్ని కాపాడాలని కోరుతూ ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి భారత రాష్ట్రపతికి లక్ష ఉత్తరాలు పంపించనున్నట్టు ఉత్తరాంధ్ర టిడిపి శిక్షణ శిబిరం మాజీ డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు ప్రకటనలో తెలిపారు. వాస్తవాలను వార్తలుగా రాసి, సమాజం ఉన్నతికి పాటుపడుతున్న పత్రికారంగం, వివిధ పత్రికల కార్యాలయాలు, పత్రిక సంస్థలో పనిచేసే జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లపై భౌతిక దాడులు ఎక్కువయ్యాయన్నారు. ఇటువంటి పరిణామాలు అప్రజాస్వామిక చర్యలని, ఇటువంటి చర్యలను ఆపకపోతే ప్రజాస్వామ్యం పరిడవిల్లెందుకు ఆటంకం ఏర్పడుతుందన్నారు.

రైతు బ(బే)జారు

- తాత్కాలికంగా ఏర్పాటు చేసినా కనుమరుగు
- బస్టాండ్, రోడ్లపై వ్యాపారాలు చేస్తున్న రైతులు
- స్థల వివాదంతో ఆగిన నిర్మాణం

జిల్లాలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఒకటి. ఈ ప్రాంతంలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని ఇక్కడ ప్రజల చిరకాల కోరిక. పాలకులు, అధికారుల అలసత్వం ఒక వైపు అయితే మరో వైపు స్థల వివాదంతో నిర్మాణం బేజారు గా మారింది. తాత్కాలికంగా రైతు బజార్ ఏర్పాటుకు మంత్రి ప్రారంభించినప్పటికీ కొద్ది రోజులకే కనుమరుగైంది.

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీపై పలాస, మందస, కోటబొమ్మాళి, టెక్కలి, వజ్రపుకొత్తూరు, నందిగాం, మెలియాపుట్టి మండలాలకు చెందిన వందలాది గ్రామాల ప్రజలు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఆయా మండలాల్లో పండిస్తున్న కూరగాయలు, పళ్లు, చిరుధాన్యాలను పలాస-కాశీబుగ్గ తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. వాస్తవానికి రైతుబజార్ అవసరం. రైతుబజార్ లేకపోవడంతో కాశీబుగ్గ బస్టాండ్, మూడు రోడ్ల కూడలి, కెటి రోడ్డు పక్కల పెట్టుకుంటూ వ్యాపారం సాగిస్తున్నారు. ఉద్దానం ప్రాంతంలో పండిస్తున్న కూరగాయలు, పళ్లు, చిరుధాన్యాలను తక్కువ ధరలకే అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నామని ఆయా ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుబజారు ఉంటే ఇటువంటి పరిస్థితి ఉండేది కాదని వాపోతున్నారు. మరోవైపు తీసుకొచ్చిన తక్కువ సామాన్యులపై మున్సిపాలిటీ పన్నులు వేస్తూ అధిక భారాన్ని మోపుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కాశీబుగ్గ బస్టాండ్‌లో కూరగాయలు విక్రయిస్తున్న ఉద్దాన ప్రాంత రైతులు

రోడ్లపైనే వ్యాపారాలు

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వస్తున్న రైతులు రైతుబజార్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుబజార్ లేక రైతుల అవస్థలు పడుతున్నారని వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కాశిబుగ్గ మూడు రోడ్ల కూడలి సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలికంగా రైతుబజార్ ప్రారంభించారు. కొద్దిరోజులకే కనుమరుగుకావడంతో యథావిధిగా మరలా బస్టాండ్ ఆవరణలో రోడ్లపై కూర్చుని వ్యాపారం చేసే పరిస్థితి నెలకొంది. పాలకులు అధికారులు పూర్తిస్థాయిలో చొరవ చూపక పోవడం వల్లే ఈ ప్రాంతంలో రైతుబజార్ ఏర్పాటుకు నోచుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.



రైతుబజారు నిర్మాణానికి కేటాయించిన స్థలం

సర్దుమణగని స్థల వివాదం

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీకి రైతుబజార్ అవసరం. పలాస కాశీబుగ్గ జంట పట్టణాలపై వందలాది గ్రామాలు ఆధారపడి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రైతులకు అండగా నిలవాలని పట్టణ ప్రజలకు తక్కువ ధరతో కూరగాయలు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో అప్పటి టిడిపి ప్రభుత్వం కాశీబుగ్గ న్యూ కాలనీ సమీపంలో కాశీబుగ్గ రెవెన్యూ పరిధిలో 207/2బి సర్వే నంబరులో సోషల్ వెల్ఫేర్‌కు చెందిన 27 సెంట్లు స్థలాన్ని కేటాయించారు. అనంతరం రూ.40 లక్షలు మంజూరు చేశారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో చాలా ఏళ్ల నుంచి చిన్నచిన్న దుకాణాలు పెట్టుకుంటూ జీవనం సాగిస్తుండడంతో స్థల వివాదం ప్రారంభమైంది. అప్పటి నుంచి నేటివరకు స్థల వివాదం సద్దుమణకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా రైతు బజార్ నిర్మాణం తయారైంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు చాలా చూపి రైతుబజార్ నిర్మాణం కోసం కృషి చేయాలని పట్టణ ప్రజలతో పాటు ఇతర ప్రాంత ప్రజలు రైతులు కోరుతున్నారు.

ఈ విషయంపై తలగాన వాణి ప్రసన్నకు వివరణ కోరగా, స్థలం కోర్టు కేసులో ఉందని, మంజూరైన నిధులు రూ.40 లక్షలు వెనుకకు తిరిగి వెళ్లి పోయాయని చెప్పారు. స్థల వివాదం సద్దుమణిగిన వెంటనే నిధులు మంజూరు చేయించి రైతుబజార్ నిర్మిస్తామని తెలిపారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- బూర్జ

ఒక్క రూపాయి అవినీతి లేకుండా సంక్షేమ పథకాలను అర్హత కలిగిన లబ్ధిదారులకు అందించి అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మధ్య వారిధిగా పనిచేసిన వాలంటీర్ల సేవలు అభినందనీయమని శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉత్తమ సేవలందించిన వాలంటీర్ల సత్కార సభలో పాల్గొన్నారు. ఉత్తమ సేవలందించిన వాలంటీర్లకు ప్రభుత్వం అందించే సేవావజ్ర, సేవారత్న, సేవా మిత్రలను స్పీకర్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందించడంలో ఎమ్మెల్యే కంటే వాలంటీర్లు కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు జన్మభూమి కమిటీ సభ్యుల పేరిట లంచాలు తీసుకుని సంక్షేమ పథకాలు అందించడం చూశామన్నారు. నేడు అర్హత ఉంటే చాలు పార్టీలు, కులాలు చూడకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. చంద్రబాబు వస్తే సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని టిడిపి వారే అంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, రాష్ట్ర టిట్కో డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు కరణం కృష్ణమ నాయుడు, బుడుమూరు సూర్యారావు, పిఎసిఎస్ అధ్యక్షులు నారాయణమూర్తి, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, సర్పంచ్ వేగు అనురాధ పాల్గొన్నారు.

లావేరు: గ్రామ, వార్డు వాలంటీర్ల సేవలు అమోఘమైనవని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో వాలంటీర్లకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవలకు ప్రతిరూపం వాలంటర్లని, అభివృద్ధి, సంక్షేమం సిఎం జగన్మోహన్ రెడ్డికి రెండు కళ్లన్నారు. ఈ సందర్భంగా వాలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ, ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసరావు, ఎంపిడిఒ గొర్లె భాస్కరరావు, తహశీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎపిఎం మావూరి మాధవి లత, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



బూర్జ : ప్రశంసాపత్రం అందజేస్తున్న స్పీకర్ సీతారాం

టెక్కలి రూరల్ : వాలంటరీ వ్యవస్థను తీసుకొచ్చి సిఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాయలంలో వాలంటీర్ల వందనం కార్యక్రమంలో భాగంగా సన్మానించారు. అనంతరం సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులను అందజేశారు. ఎంపిడిఒ విజయలక్ష్మి, వైస్ ఎపిపిలు పేడాడ రమేష్, మన్నెల కిషోర్, ఎంపిటిసిలు పీత హేమలత, కూన పార్వతి, వాకాడ శ్రీధర్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు నాగళ్ల శంకరరావు, సర్పంచ్ జి.సుజాత, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

వడ్డితాండ్ర కార్యదర్శి మృతి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి



తులసి (ఫైల్)

మండలంలోని వడ్డితాండ్ర పంచాయతీ కార్యదర్శి గజినీ తులసి (37) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఆమె స్వగ్రామం యామాలపేటలో అంతిక్రియలు నిర్వహించారు. భర్త రైల్వేలో ఉద్యోగం చేస్తున్నారు. తులసికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆమె మృతిపై ఎంపిడిఒ జి.ఉమాసుందరి, కార్యదర్శుల సంఘం అధ్యక్షులు దంప శ్రీనివాసరావు విచారం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- నందిగాం

ప్రభుత్వ విద్యకు సిఎం జగన్ ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. నందిగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ ఇంటర్ వీడ్కోలు సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి తల్లిదండ్రులకు, సమాజానికి, గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ ఆర్.జనార్ధనరావు మాట్లాడుతూ విద్యార్థులంతా క్రమశిక్షణతో కూడిన విద్యతోపాటు సమాజ శ్రేయస్సు ఆకాంక్షించేలా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ జయరాం, ఎంపిటిసి ప్రతినిధి ఎ.విష్ణు, అధ్యాకులు అరవింద్, బి.నారాయణ, పోలయ్య, చిరంజీవి, పి.వెంకటరావు, బి.సంపదరావు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు మాజీ సైనికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బందోబస్తు విధులు నిర్వహించేందుకు మాజీ సైనికుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా సైనిక సంక్షేమాధికారి శైలజ ప్రకటనలో తెలిపారు. 50ఏళ్ల లోపు వయసు గల మాజీ సైనికులు ఈ విధులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు జిల్లా ఎస్‌పి నుంచి వివరాలు కోరడం జరిగిందని ఆమె తెలిపారు. ఆసక్తి ఉన్న వారు మాత్రమే ఈ విధులకు హాజరు కావాలన్నారు. విధులకు హాజరయ్యేందుకు సిద్ధమైన వారు వారి నివాస ప్రాంతం పరిధిలో శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ డిఎస్‌పి కార్యాలయాల్లో వివరాలతో కూడిన దరఖాస్తులను అందజేయాలని సూచించారు. ఈ విధుల్లో పాల్గొనే మాజీ సైనికులకు గౌరవ వేతనం చెల్లిస్తారని తెలిపారు.



మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత


పరిసరాలపై అవగాహన అవసరం

టెక్కలి : మహిళలు తమ పరిసరాలపై అవగాహన కలిగి ఉండాలని టెక్కలి జూనియర్ కోర్టు ఇన్‌ఛార్జి సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. స్థానిక విశ్వజ్యోతి జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ దుప్పల రవికుమార్ అధ్యక్షతన విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు స్నేహపూర్వక భావన కలిగి ఉండాలన్నారు. దేశభక్తి విధానం అవసరమన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ నర్సింగరావు, న్యాయవాదులు దవళ రాజేశ్వరరావు, పొట్నూరు ఆనందరావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

25న తెలగల బహిరంగ సభ

ఇచ్ఛాపురం: తెలగలను బిసిలో చేర్చాలని డిమాండ్ చేస్తూ... పాదయాత్ర చేపట్టానని, ఈ నెల 25న విజయనగరం జిల్లా పూసపేటరేట వద్ద ఉత్తరాంధ్ర గర్జన సభ నిర్వహిస్తున్నామని తెలగ సంఘం రాష్ట్ర నాయకులు పల్లంపట్ల వెంకటరామారావు (పివిఆర్) తెలిపారు. ఈ మేరకు స్థానిక స్వేచ్ఛావతి ఆలయాన్ని బుధవారం సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తెలగలను బిసిలో చేర్చాలని కోరుతూ ఇచ్ఛాపురం నుంచి పాదయాత్ర చేపట్టానని, మంగళవారం పాయకరావుపేటలో ముగిసిందని అన్నారు. ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట తెలగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇక్కడ నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు.

పలాస : గర్జన సభను విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర తెలగ సంఘ అధ్యక్షులు పివిఆర్ పిలుపునిచ్చారు. కాశీబుగ్గ రామాలయంలో స్థానిక తెలగ సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంఘ అధ్యక్షులు రూపు సుందర్, ప్రతాప్, బల్ల శ్రీను, చిరంజీవి, రమేష్, రాము, శ్రీకాంత్ పాల్గొన్నారు.



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

ఆశీలు వేలంపాట

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమేష్ అధ్యక్షతన వివిధ రకాల అశీలు, డైలీ మార్కెట్, వీధి గుత్త, కమేల, కొబ్బరి చెట్ల ఫలసాయం, పాత పత్రికలకు బహిరంగ వేలం పాట బుధవారం నిర్వహించారు. ఈ సారి పిట్ట భైరాగి అన్ని రకాల ఆశిలూ వసూల్ చేరుకోవడానికి అత్యధిక పాట పాడి దక్కించుకున్నారు. డైలీ మార్కెట్ వీధి గుత్తా రూ.23 లక్షల వెయ్యి, కమెలా రూ.1.21 లక్షలు, కొబ్బరి చెట్ల ఫలసాయం రూ.4 వేలు, పాత పత్రికలు రూ.5,300కు ఎక్కువ మొత్తం పాడి దక్కించుకున్నారు. మొత్తం ఈ వేలం పాటలో ఆరుగురు పోటీ పడ్డారు. అయితే గతేడాది కంటే ఈ సారి రూ.6 లక్షలు ఆదాయం తగ్గింది. గతేడాది గ్రామ దేవత ఉత్సవాలు ఉండడంతో పాటదారుల మధ్య పోటీ గణనీయంగా పెరిగింది. ఈ సారి ఆ పాటదారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. వచ్చే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెడతానని కమిషనర్ తెలిపారు.

కళింగ కార్పొరేషన్ చైర్మన్‌కు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ కళింగ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా దుంపల రామారావు (లక్ష్మణరావు) ఇటీవల నియమితులయ్యారు. ఇటీవల సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిని కలిసి తొలిసారిగా జిల్లాకు బుధవారం చేరుకున్నారు. పైడిభీమవరం వద్ద అభిమానులు 200 కార్లతో ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి ర్యాలీగా చిలకపాలెం, లోలుగు, పొందూరు, రాపాక మీదుగా తన స్వగ్రామమైన తోలాపి చేరుకున్నారు. కుటుంబ సభ్యులను కలిసి అక్కడ నుంచి నగరంలోని తన స్వగృహానికి చేరుకున్నారు. ముందుగా సింహద్వారం వద్ద ఉన్న మాజీ ఎంపీ, కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలు వేసి నివాళ్లర్పించారు. పొందూరు మండలం తోలాపికి చెందిన రామారావు రెండు దశాబ్దాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ జిల్లా నేతగా వ్యవహరించారు. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన ఆయన ఆల్ ఇండియా బ్యాంక్ వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్ (ఎఐబిసిఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బిసిల సమస్యలపై పోరాటం సాగించారు. జగన్ అప్పగించిన బాధ్యతను విజయవంతంగా నిర్వహించి కళింగుల ప్రయోజనం చేకూర్చేందుకు కృషి చేస్తానని అన్నారు.

కార్మికులవి న్యాయమైన డిమాండ్లు

ఆమదాలవలస : ఆచార్య ఎన్.జి.రంగ వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలో పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్దనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో కృషి విజ్ఞాన కేంద్రం ఎదుట ఆచార్య ఎన్‌జిరంగ విశ్వవిద్యాలయం పరిధిలో ఎఆర్ఎస్, ఆర్ఎఆర్ఎస్, కెవికెలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికచట్టం ప్రకారం ఒకరోజు వేతనం రూ.653 చెల్లించాలని, వ్యవసాయ కార్మికులకు రూ.336 చెల్లించి శ్రమ దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్‌జి రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో రీసెర్చ్ స్టేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు లేబర్ వివరాలను రీసెర్చ్ స్టేషన్లలో నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం కాంట్రాక్ట్ కార్మికుల అధ్యక్షురాలు ఎన్. సీతామహాలక్ష్మి, కార్యదర్శి త్రివేణి, చిట్టిబాబు, అంబటి యుగంధర్, గణపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనార్ధనరావు

జర్నలిస్టుపై దాడి హేయమైన చర్య



పలాస : వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

పలాస : సత్యసాయి జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి నిరసనగా పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలు, మందస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. తొలుత జర్నలిస్టులు ర్యాలీ నిర్వహిస్తూ... మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి, ఆర్‌డిఒ భరత్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు డి.మహరణ, సిహెచ్.జగదీష్, రామకృష్ణ, నేజీతా, హరినారాయణ పాల్గొన్నారు. అలాగే సిఐఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, జుత్తు వీరాస్వామి జర్నలిస్టులపై దాడిని ఖండించారు.

కోటబొమ్మాళి: సమాజంలో ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడే జర్నలిస్టుపై వైసిపి నాయకులు దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని టెక్కలి నియోజకవర్గ జనసేన నాయకుడు పల్లి కోటేశ్వరరావు అన్నారు. రాప్తాడులో సిఎం సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి జర్నలిస్టుపై మూకమ్మడిదాడి చేయడం సరైంది కాదన్నారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రొడక్షన్ ట్రైనీలుగా పాలిటెక్నిక్ విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం చెన్నైకి చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. సంస్థ ప్రతినిధులు అరుణ్ కుమార్, విక్టర్ హాజరై ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. వివిధ విభాగాల నుంచి 256 మంది విద్యార్థులు ఈ ఎంపికల్లో పాల్గొనగా 233 మందిని ప్రొడక్షన్ ట్రైనీలుగా ఎంపిక చేశారు. ఈ ప్రాంగణ ఎంపికల్లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు ఆమదాలవలస, విజయంనగరం, ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాలలు వెంకటేశ్వర, శివాని, ఆదిత్యకు చెందిన మెకానికల్, ఎలక్ట్రికల్, ఇసిఇ విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.18 వేల వేతనంతో పాటు అలవెన్స్‌లు, పై చదువులు చదువుకునే అవకాశం కల్పిస్తారు. కార్యక్రమంలో అధ్యాపకులు దామోదరరావు, యుగంధర్, గోవిందనాయుడు పాల్గొన్నారు.



పాఠశాల ప్రిన్సిపాల్ సుజాతను విచారిస్తున్న ఆర్‌జెడి జ్యోతికుమారి

విచారణ అనంతరం చర్యలు

ఆర్‌జెడి జ్యోతికుమారి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలపై పూర్తిస్థాయి విచారణ జరిపిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ ఆర్‌జెడి ఎం.జ్యోతి కుమారి తెలిపారు. సెంటెన్స్ పాఠశాలపై ఇటీవల వచ్చిన ఆరోపణలపై బుధవారం ఆమె జిల్లా విద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కార్యాలయంలో పాఠశాలపై సమగ్ర వివరాలను అడిగి తెలుసుకుని తల్లిదండ్రుల ఫిర్యాదు వివరాలు, ఎంఇఒ విచారణ నివేదికలు పరిశీలించి పాఠశాల యాజమాన్య పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. 1200 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు ఒకేఒక్క ప్రిన్సిపాల్ బాధ్యత వహించడం కష్టంగా ఉంటుందన్నారు. ప్రాథమిక స్థాయి, ఉన్నత స్థాయిలో ఇద్దరు వ్యక్తులు వేరువేరుగా పర్యవేక్షిస్తే ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా చూడవచ్చని ప్రిన్సిపాల్ సుజాతకు సూచించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు భవిష్యత్‌లో ఏ ప్రైవేట్ పాఠశాలలో విధులు చేపట్టకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత మీపైనే ఉందని, సర్వీస్ సర్టిఫికెట్ ఇచ్చేటప్పుడు కాండాక్ట్‌పై తెలియజేయాలని ఆర్‌జెడి సూచించారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం జరిగితే పాఠశాల గుర్తింపు రద్దుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం సెంటెన్స్ పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ సెంటెన్స్ పాఠశాలలో నెలకొన్న సంఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారి, డిప్యూటీ విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ చేపట్టడం జరుగుతుందని, విచారణ నివేదిక ఆధారంగా పాఠశాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒలు జి.రాజేంద్రప్రసాద్, టింగరాజు, సిఆర్‌పిలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పొందూరు



జ్యోత్స్న, జడ్జి

మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జస్టిస్ బి.జ్యోత్స్న పేర్కొన్నారు. స్థానిక సివిల్ కోర్టులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజీకి అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి ఇరువర్గాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను క్షక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు. వచ్చేనెల 8 వరకు ప్రీ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని, రాజీ చేసుకోవాలనుకునే వారు స్థానిక కోర్టును సంప్రదించాలని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన వరప్రసాద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



పుష్పగుచ్ఛం అందజేస్తున్న వరప్రసాద్

జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ కుప్పిలి వరప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో నాబార్డు డిడిఎం కలిసి నాబార్డుకు సంబంధించి వివరాలను కలెక్టర్‌కు వివరించారు.

ఆరోపణలు కాదు.. అవినీతి నిరూపించాలి

ప్రజాశక్తి- పొందూరు

ప్రతిపక్ష నాయకులు ఇటీవల వేదికలెక్కి తాను అక్కడ దోచేశాను, ఇక్కడ దోచేశాను అంటూ ఆరోపణలు చేయడమే తప్పా తన అవినీతిని సాక్ష్యాలతో నిరూపించగలరా అంటూ స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రశ్నించారు. బుధవారం మండలం లోలుగులో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత పాలకులు నియోజకవర్గాన్ని గాలికి వదిలేశారని, ఒక్క విద్యాసంస్థను తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో తాగు, సాగునీరుతో పాటు రహదారులు అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఆమదాలవలస-శ్రీకాకుళం రహదారిని మా హయాంలోనే పూర్తిచేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి కిల్లి ఉషారాణి, సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపిటిసి లక్ష్మంనాయుడు, వైసిపి యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం



మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహననాయుడు

సామాజిక భవనం ప్రారంభం

శ్రీకాకుళం రూరల్ : నియోజకవర్గం పరిణతీలో బలివాడలో రూ.10లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి ఆయన బలివాడ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి టిడిపి విజయానికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం జరిగిన సభలో ఎంపి, మాజీ ఎమ్మెల్యేలను గ్రామస్థులు సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో గడచిన ఐదేళ్ల వైసిపి పాలన, చంద్రబాబు పాలనతో బేరేజి వేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రైతులు, యువత, మహిళలు అన్నివర్గాల ప్రజలను జగన్ ప్రభుత్వం మోసం చేసిందని, మళ్లీ ఎన్నికల సమయంలో ప్రజలను మభ్య పెట్టేందుకు గ్రామాల్లోకి వస్తున్నారని విమర్శించారు. గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఏమిటో మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, అరవల రవీంద్ర, కనుగుల శివ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆఫీసర్ కేడర్ ఉద్యోగాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

భారత సైనిక దళాల్లో ఉన్నతమైన ఆఫీసర్ క్యాడర్ ఉద్యోగాలపై ఉత్తరాంధ్రలోని యువత అవగాహన ఉండడం లేదని వారిలో చైతన్యం పెరగాలని ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ డైరక్టర్ బి.వి రమణ అన్నారు. అరసవల్లి మిల్లు జంక్షన్‌లో ఆర్మీ ఉద్యోగాలపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కోచింగ్ సెంటర్లు, అకాడమీలు కేవలం ఎంసెట్, జెఇఇ మెయిన్స్, నీట్ ఎంట్రన్స్ కోసమే చెబుతున్నారన్నారు. అదే సమయంలో విడుదలవుతున్న ఎన్‌డిఎ, నేవెల్ అకాడమీ, టెక్నికల్ ఎంట్రీ, క్యాడర్ టెక్నికల్ ఎంట్రీ, ఎఎఫ్ఎంసిపై యువతకు అవగాహన కల్పించడం లేదన్నారు. ఎంసెట్, నీట్ ఎంట్రన్స్ వంటివి రాస్తే నాలుగేళ్లలో వారికి గ్రాడ్యుయేషన్ మాత్రమే పూర్తి అవుతుందన్నారు. ఎన్‌డిఎ, నేవెల్ అకాడమీ, టెక్నికల్ ఎంట్రీ స్కీమ్, క్యాడెట్ టెక్నికల్ ఎంట్రీ, ఎఎఫ్ఎంసి వంటి పరీక్షలు రాసి ఎంపికైతే కేంద్ర ప్రభుత్వమే నాలుగేళ్లు వారిని గ్రాడ్యుయేషన్ చదివించుకొని భారత సైనిక దళాల్లో ఆఫీసర్ క్యాడర్ ఉద్యోగాల్లో శిక్షణ ఇచ్చి 21 ఏళ్లకే సైనిక దళాల్లో ఉన్నతాధికారి పోస్టింగ్‌తో పంపిస్తున్నారన్నారు. జిల్లాలో 200 పాఠశాలల్లో విద్యార్థులకు ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ ప్రత్యేక బృందం డిఫెన్స్ ఆఫీసర్స్ ఎంట్రీ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్విరామంగా కృషి చేసి అవగాహన తరగతులు నిర్వహించామని డైరెక్టర్ రమణ తెలిపారు. ఐఎసి అడ్మిన్ చిందు శ్రీకాంత్, ఇన్‌స్ట్రక్టర్ కిరణ్, వెంకటరావు, జగదీష్, రాజశేఖర్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రమణ



భవనాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్, తిలక్

అచ్చెన్నాయుడుకు ఇప్పుడు గుర్తుకొచ్చారా?

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు గ్రామాల్లో తిరుగుతున్నారని, ఈ ఐదేళ్లలో ప్రజలు ఇప్పుడు గుర్తుకొచ్చారా? అని ఎమ్మెల్యే దువ్వాడ శ్రీనివాస్, వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీలో రూ.23 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో గెలిచిన తరువాత ఇప్పటి వరకు మీ గ్రామాలకు రాలేదని, రెండు నెలలు ఎన్నికలు ఉండగా ఇప్పుడు పర్యటిస్తున్నారని విమర్శించారు. టిడిపికి ఓటేస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయని, సంక్షేమ పథకాల కోసం వారి చుట్టూ తిరగాల్సి వస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, సచివాలయ కన్వీనర్ గద్దలన నాగభూషణరావు, సర్పంచ్ గురువెల్లి కేశవరావు, ఎంపిటిసిలు పూజారి సత్యం, బగాది మాధవివిదాకర్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న గణపతి

విద్యార్థి దశే కీలకం

ప్రజాశక్తి- సోంపేట

విద్యార్థి దశే పిల్లలకు కీలకమని, పిల్లలకు తల్లిదండ్రులే వారధులుగా నిలిచి విజేతలుగా తీర్చిదిద్దాలని, చదువుతో పాటు సంస్కారం, ఆత్మబలం పెంపొందేలా తోడ్పడాలని మనోవికాస నిపుణులు రాంబాబ్జీ గణపతి అన్నారు. మండలంలోని పాలవలస ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బి.కృష్ణారావు అధ్యక్షతన 'విద్యార్థులతో తల్లిదండ్రుల అనుబంధం' అనే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. చిన్నతనం నుంచే పిల్లలు నడక ఒడ్డులా నిలబడే భావితరాలకు మంచి సంస్కారవంతులైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ముఖ్యపాత్ర వహించాలని కోరారు. పక్కా ప్రణాళికతో రానున్న వార్షిక పరీక్షల్లో విజయం సాధించాలంటే ఒత్తిడి రహిత వాతావరణంలో ముందుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు. ఫలితాలు ఎలా ఉన్నా స్వీకరించాలని కోరారు. సహజ ధోరణి, సరళత్వం, సమయపాలనకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. ఆకర్షణలు, పెడధోరణులకు దూరంగా ఉండాలని తెలిపారు. పరీక్ష సమయాల్లో సాత్వికాహారం, సరిపడే నిద్ర, మానసిక ఉల్లాసం పెంచుకోవాలన్నారు. కుటుంబంలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకోవాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



చిత్రపటాన్ని స్వీకరిస్తున్న శ్యామలాదేవి

శ్యామలాదేవి అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సీనియర్ సినీ నటుడు స్వర్గీయ ఉప్పలపాటి కృష్ణంరాజు సతీమణి ఉప్పలపాటి శ్యామలాదేవి బుధవారం సందర్శించారు. మంగళవారం జిల్లా వచ్చిన ఆమెకు ప్రభాస్ అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ స్వామివారి నిజరూప చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం శ్రీకూర్మం కూర్మనాథ స్వామి ఆలయానికి వెళ్లారు. ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ టౌన్ వైడ్ అధ్యక్షులు ప్రభాస్ సూర్య మాట్లాడుతూ ప్రభాస్‌పై ఉన్న అభిమానంతో నగరంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఆమెతో పాటు ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ టౌన్ వైడ్ కార్యదర్శి పైడి రాజు, విజయ్, న్యూబడ్ బ్యాంకు మేనేజర్ మణికంఠ, సాయి, జెసిఐ దూసి సంతోష్, దాలినాయుడు, ఈశ్వర్, నాగేంద్ర ఉన్నారు.



మాట్లాడుతున్న బాబూరావు

వాలంటీర్లకు ధీటుగా పనిచేయాలి

ప్రజాశక్తి- పలాస

ప్రతి 50 మందికి ఒక కుటుంబ సాధికారిత సారథులు దత్తత తీసుకొని వారికి టిడిపి సూపర్-6 కార్యక్రమాల అమలుపై వివరించాలని, వారందరూ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓట్లు వేసేవిధంగా ప్రచారం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి సీనియర్ నాయకులు యార్లగడ్డ వెంకన్న చౌదరి పిలుపునిచ్చారు. పలాస టిడిపి కార్యాలయంలో ఆవరణలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. వాలంటీర్లు కన్నా... మెరుగ్గా సేవలు చేసి రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి దోహదపడాలని కోరారు. కార్యక్రమంలో బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, అంబటి కృష్ణమూర్తి, సప్ప నవీన్, జోగ మల్లి, శంకర్, గోళ్ల చంద్రరావు, బంకూరు రవికుమార్‌గుప్తా, సత్యం, రామకృష్ణ, దడియాల నర్సింహులు పాల్గొన్నారు.

టిడిపి విజయానికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో వైసిపి పాలనలో యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, జాబ్ కేలండర్ విడుదల చేస్తామని నమ్మించి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా తీరని అన్యాయం చేశారని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి అన్నారు. అరసవల్లిలో బుధవారం పెద్దపాడు యువతతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా యువత పెద్దఎత్తున పోలింగ్‌లో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా వారిని టిడిపిలోకి ఆహ్వానించి కండువాలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2024 ఎన్నికలు ఎంతో కీలకమైనవని, యువత తమ ఓటుహక్కును వినియోగించుకోవడంతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుం కట్టాలన్నారు.



టిడిపిలో చేరిన పెద్దపాడు యువత

తేనెలొలుకు మన తెలుగు భాష



శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న హరనాథరావు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. వైస్-ఛాన్సలర్ కె.ఆర్. రజని మాట్లాడుతూ ప్రపంచీకరణలో భాగంగా ఉపాధి, విజ్ఞానం కోసం ఎన్ని భాషలనైనా అధ్యయనం చేయవచ్చుగాని మాతృభాషను మరిచిపోరాదన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవిటి: తేనెలాంటి మధురమైనది తెలుగు భాషని కళ్యాణి ఆంగ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిందుమాధవి అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వేడుకలు స్థానిక కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు మణి విద్యార్థులకు దేశభక్తి, మాతృభాష విశిష్టత వివరించారు.

నందిగాం : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా అ అక్షరం ఆకారంలో విద్యార్థులు కూర్చున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకరరావు, గున్నయ్య, వి.కుమారి, కె.తిరుపతిరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలో పెద్దలక్ష్మీపురం ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా పాతపట్నానికి చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు రామరాజు పదో తరగతి విద్యార్థులకు వివిధ అంశాలపై సూచనలు ఇచ్చారు. గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన పది విద్యార్థులకు పరీక్ష కిట్లు ఇచ్చారు. అలాగే విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరావుకు రామరాజు, సర్పంచ్ బి.ఉదయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు రమణమూర్తి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గారావు, ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, శ్రీహరి, కృష్ణారావు పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, అధ్యాపకులు రామారావు, త్రినాథ్, శ్రీనివాసరావు, జగన్నాథం, బిశాయ్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంలో ప్రిన్సిపాల్ రోబిన్ కముఆర్ పాడి, వైస్ ప్రిన్సిపాల్. సుశాంత్ జెన్నా, అధ్యాపకులు లోకేశ్వరరావు, శ్రీనివాసరావు, రాజేంద్ర త్రిపాఠి, సంతోష్‌కుమార్, నాగేశ్వరరావు, మోహనరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : మాతృ భాష, సాంస్కృతిక వైవిధ్యం పట్ల ప్రతిఒక్కరూ అవగహన కలిగి ఉండాలని, మాతృబాష గొప్పతనాన్ని గుర్తించి నేర్చుకోవాలని పూర్వపు అధ్యాపకులు పైడి హరనాథరావు అన్నారు. బుధవారం నగరంలో ప్రభుత్వ మహిళా కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్య చంద్రరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర నారాయణ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, చరిత్ర శాఖాధిపతి డాక్టర్ ఎన్.చిన్నారావు, డాక్టర్ జ్యోతిలక్ష్మి, డాక్టర్ గిరిజ, వి.భవాని పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



ఆమదాలవలస : మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆమదాలవలస: మండలం కొర్లకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పాఠశాల తెలుగు భాషోపాధ్యాయులు శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవితంలో మొట్టమొదటగా నేర్చుకునే భాష మాతృభాష అన్నారు. అనంతరం గ్రామంలో మాతృభాషా ఆవశ్యకతను తెలియజేసేలా నినాదాలతో మానవహారం నిర్వహించి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.యమున, ఉపాధ్యాయులు సరస్వతి, శ్రీనివాస్, రాజు, శ్రీనివాసరావు, సుజాత, సుధాకర్ పాల్గొన్నారు.



కవిటి : అ, ఆ అక్షరాలుగా కూర్చున్న విద్యార్థులు

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

ప్రజాశక్తి- సోంపేట

ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూనే విద్య, వైద్యంతో పాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తున్న ఘనత సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు భవనాలను బుధవారం ప్రారంభించారు. అలాగే ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వద్ద నూతనంగా నిర్మించిన భవన సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సిఎం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపిలు ఎన్.దాస్, దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ నగిరి ప్రభావతి, నాయకులు ఎస్.భాస్కరరావు, రాజారావు, బి.మోహనరావు, పద్మావతి పాల్గొన్నారు.

నెరవేరిన సొంత ఇంటి కల

ఇచ్ఛాపురం: ప్రతి పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికి దక్కిందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని మశాకపురంలో నిర్మించిన జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లను బుధవారం ప్రారంభించారు.



సోంపేట : పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న విజయ

ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపిలో సంక్షేమం, సుపరిపాలన, అభివృద్ధే లక్ష్యంగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నరాయణమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, చాట్ల తులసీదాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పలాస : వివిధ రకాలు, సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కళాకారులు కోరారు. స్థానిక ప్రభుత్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రీకాకులానికి చెందిన చెందిన సూర్యకుమారి బుర్రకథ బృందం బుధవారం కళాజాతా నిర్వహించి అవగాహన కల్పించారు. వివిధ సుఖవ్యాధులు, ఎయిడ్స్, కరోనా హెపటైటిస్-బి వంటి వ్యాధులు ఏ విధంగా ఎదుర్కోవాలో వివరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ గణపతిరావు, ఎన్ఎస్ఎస్ అధికారి మధు, లెక్చరర్లు శ్రీనివాస పట్నాయక్, నర్సింహులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఆర్థిక అక్షరాస్యతా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ సుబ్రాంషు శేఖర్ బెహరా, ఆడిషనల్ మేనేజర్ టి.వి.ఎస్.ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఇచ్ఛాపురంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం ఓటిపి, పిన్ నంబర్లు ఇతర వ్యక్తులకు తెలియపర్చకుండా గోప్యత పాటించాలన్నారు. ఈ ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ద్వారా ప్రజలు బ్యాంకింగ్ సేవలపై పూర్తి అవగాహన పొందాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కె.అశోక్, జిల్లా కో-ఆర్డినేటర్ ఎ.హరినాథ్, సిఎఫ్ఎల్ నోడల్ ఆఫీసర్ పి.అనిల్, ఆడిట్ ఆఫీసర్ సంగీతదాస్, ఫీల్డ్ ఆఫీసర్ మోహన్ పాల్గొన్నారు.




నాగభూషణాన్ని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పూర్వ ఎంఇఒకు సన్మానం

ప్రజాశక్తి- టెక్కలి

ఏ ఉద్యోగైనా తాము చేసే వృత్తిలో నిబద్ధతతో, నిజాయతీతో పనిచేస్తే ఆ వృత్తి గుర్తింపు నిస్తుందని ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావులు అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ ఎంఇఒ దాసరి నాగభూషణం ఆత్మీయ వీడ్కోలు సభ బుధవారం నిర్వహించారు. అనంతరం నాగభూషణంకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తమ్మినేని వైకుంఠరావు, బొడ్డేపల్లి నేతాజీ, రోణంకి శ్రీనివాసరావు, సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది రవి, సంతోష్, రాంబాబు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

మళ్లీ వైసిపికి వస్తారు...

కోటబొమ్మాళి: టిడిపిలోకి చేరిన వారంత గత ఎన్నికల్లో అచ్చెన్నాయుడుకు సహకరించారని, టిడిపి ఓడిపోతే మళ్లీ వైసిపిలోకి వస్తారని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, వైస్ ఎంపిపి బోయిన నాగేశ్వరరావు, వైసిపి మండల నాయకులు నూక సత్యరాజు వ్యాఖ్యానించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. టిడిపికి వెళ్లిన వారంతా నిజమైన వైసిపి కార్యకర్తలు కారని అన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తుమని అన్నారు. సమావేశంలో మండల విప్ బొడ్డు అప్పన్న, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజులు, పేడాడ వెంకటరావు, బమ్మిడి గణపతిస్వామి, ఉప సర్పంచ్ బాలకృష్ణ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రీడలు మానసిక, శారీరక ఆనందం, ఆరోగ్యం పొందడానికి ఎంతో ఉపయోగ పడతాయని స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్, పి.జి.గుప్తా, బి.వి.రవిశంకర్, ఎస్.జోగి నాయుడు అన్నారు. జిల్లా ఉషు అసోసియేషన్ ఆధ్వర్యాన బుధవారం జాతీయ స్థాయిలో రాంచీలో ఈ నెల 22 నుంచి 25 వరకు జరగనున్న ఫెడరేషన్ కప్ పోటీలకు ఎంపికైన ముగ్గురు క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కీర్తి ప్రతిష్టలు జాతీయ స్థాయిలో పెంచాల్సిన బాధ్యత క్రీడాకారులపై ఉందన్నారు. గతంలో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై అనేక మంది క్రీడాకారులు తమ సత్తాచాటారని గుర్తు చేశారు. జాతీయ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు రూ.ఐదు వేలు ఆర్థికసాయాన్ని సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో ఉషు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్, తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, కురిటి తారకరామ, కొమర మోహనకృష్ణ, రెడ్డి సాయిరాం, స్టార్ వాకర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉన్నత విలువలు అలవర్చుకోవాలి

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు చదువుతో పాటు ఉన్నత విలువలు అలవర్చుకోవాలని, అప్పుడే మంచి పౌరులు కాగలరని సెట్‌శ్రీ కార్యాలయ సూపరెంటెండెంట్ ఎల్ఎల్ నాయుడు అన్నారు. బుధవారం గొంటి వీధిలో విద్యాధరి డిగ్రీ కళాశాలలో శ్రీకాకుళం జూనియర్ ఛాంబర్ ఆధ్వర్యాన విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయాన్ని, భవిష్యత్‌ని దృష్టిలో ఉంచుకొని, ఉన్నత విలువలు కలిగిన వ్యక్తులుగా తయారవ్వాలన్నారు. జెసిఐ అధ్యక్షులు కూన అనిల్ కుమార్ మాట్లాడుతూ స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం, గురజాడ అప్పారావు సేవాస్ఫూర్తి విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వపు పాలకమండలి సభ్యులు డాక్టర్ జామి భీమశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండాలని, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్ పెంచుకోవాలన్నారు. సెట్‌శ్రీ మేనేజర్ వి.వి.అప్పల నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ కె.వి.రమణ, కళాశాల అధ్యాపకులు నాయుడు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సిఎం జగన్మోహన్‌రెడ్డి విద్య వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని సర్పంచ్ వడ్డీ సరిత అన్నారు. మండలంలోని డోకులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 18 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన నాడు-నేడు పథకాలు ప్రవేశపెట్టి విద్యా వ్యవస్థకు పెద్దపీట వేసిందన్నారు. పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ముందడుగులు వేస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించ వచ్చునని సూచించారు. కార్యక్రమంలో వైసిపి మండల సచివాలయం కన్వీనర్ వడ్డీ కరుణాకర్, ఎంపిటిసి భాగ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి పాల్గొన్నారు.



ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ సరిత

అభ్యసనపై రాష్ట్ర బృందం పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహిస్తున్న అభ్యసన, అభివృద్ధి అమలు తీరును రాష్ట్ర పరిశీలన బృందం పరిశీలించారు. జిల్లా విద్యా శాఖ అధికారి. కె.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో బృందం సభ్యులు లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌కుమార్, రమేష్ చంద్ర హాజరై గణితం, తెలుగు, సాంఘిక శాస్త్రం, సైన్స్, ఆంగ్లం బోధనలో ఉపాధ్యాయులు పనితీరు పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా బృందం సభ్యులు మాట్లాడారు. లిప్ కార్యక్రమం నిర్వహించిన తీరు, లిప్ రికార్డింగ్ నిర్వహణ, విద్యార్థుల స్థాయి పరిశీలించడం, బోధన, సాధనతో పాటు వెనుకబడిన విద్యార్థుల కోసం చేపట్టే ప్రత్యేక ప్రణాళిక అమలును పరిశీలించారు. అలాగే పాఠశాల నిర్వహణ తీరు, ఉపాధ్యాయుల పనితీరు, బోధనా అంశాల నిర్వహణపై తరగతి గదుల్లో కూర్చొని విద్యార్థులతో కలిసివిన్నారు. పరిశీలనలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ దేవదత్తానందం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్స్యకారులను కించపరచడం తగదు

శ్రీకాకుళం అర్బన్: మత్స్యకారుల ఓట్లతో శాసన సభ్యునిగా ఎన్నికైన కాకినాడకు చెందిన వైసిపి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మత్స్యకారులను కులం పేరుతో దూషించడం తగదని, తక్షణమే ఆయన రాష్ట్రంలో ఉన్న మత్స్యకారులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని జిల్లా మత్స్యకార సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలో మత్స్యశాఖ కార్యాలయం ఆవరణలో మత్స్యకార సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యకార సహకార సంఘం మాజీ చైర్మన్ ఎం.నర్సింగరావు మాట్లాడుతూ కాకినాడలో మత్స్యకార కుటుంబానికి చెందిన టిడిపి నాయకులు కొండబాబును ఎదుర్కొనలేక మత్స్యకారులందరిని దూషించడం తగదన్నారు. తక్షణమే మత్స్యకారులకు ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ సత్తా చూపుతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘాల నాయకులు మైలపల్లి త్రినాధరావు, చీకటి శ్రీరాములు, ఎం.రాజు, పోలీసు, అశోక్ పాల్గొన్నారు.



కొండబాబుకు సంఘీభావం తెలుపుతున్న మత్స్యకార సంఘాల నాయకులు

మాజీ మంత్రి పరామర్శ

కొత్తూరు : వైసిపి జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీవప్రసాద్ అనారోగ్యానికి గురై పర్లాకిమిడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఆస్పత్రికి బుధవారం పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.



పరామర్శిస్తున్న విజయరామరాజు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కింతలి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇఇ బయ్యన్నాయుడు తెలిపారు. విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 33 కెవి లైన్ల మరమ్మత్తుల కారణంగా కింతలి, కనిమెట్ట, తోలాపి, ధర్మపురం, దళ్లవలస, పిల్లవలస, పెనుబర్తి, అచ్చి పోలవలస, మొదలవలస, బొడ్డేపల్లి పంచాయతీల్లో అన్ని గ్రామాలకు విద్యుత్ నిలిపివేయబడునని, వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.



నివాళ్లర్పిస్తున్న నాయకులు

నేడు జయమ్మ స్మారక సభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

న్యూడెమోక్రసీ నాయకురాలు జయమ్మ నాలుగో వర్థంతి సందర్భంగా నగరంలో ఎన్‌జిఒ హోంలో గురువారం నిర్వహిస్తున్న స్మారకసభకు ప్రజలు తరలిరావాలని పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జయమ్మ స్మారక వారోత్సవాల్లో భాగంగా బుధవారం గార మండలం పూసర్లపాడులో ప్రజా సంఘాలు ప్రచారం నిర్వహించి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, పిఒఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణవేణి, పివైఎల్ జిల్లా కన్వీనర్ సార జగన్, దళిత యువత నాయకులు బాలకృష్ణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

మెళియాపుట్టి : మండలంలోని కరజాడ, గాతలవలస పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ ఎల్.జానకమ్మ బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు ఉన్న మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. ఈమెతో పాటు ఆర్ఐ వైకుంఠరావు, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రామారావుకు నివాళి

ప్రజాశక్తి- పలాస

గోదావరి లోయ ప్రతిఘటన పోరాట యోధుడు కె.రామారావు అని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు పలాస పార్టీ కార్యాలయంలో రామారావు సంతాప సభ బుధవారం నిర్వహించారు. ముందుగా రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. శ్రీకాకుళం సాయుధ గిరిజన రైతాంగ పోరాటం, నక్సల్ బరి గోదావరి తరహా పోరాటాలు నిర్మించాలని ఆయన ఎప్పుడూ తపన పడేవారని అన్నారు. విప్లవమే ఆశగా శ్వాసగా జీవితాంతం కార్మిక కర్షక పీడిత ప్రజల పక్షాన నిలబడ్డ మహాయోధుడిని అన్నారు. కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుట్టు వీరాస్వామి పిడిఎస్యు రాష్ట్ర కార్యదర్శి మద్దిల వినోద్, ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి బైరి కూర్మారావు, అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా కార్యదర్శి కోసింటి సోమేశ్వరరావు, పిడబ్ల్యు జిల్లా నాయకులు టి.సరస్వతి, గౌరమ్మ పాల్గొన్నారు.



మెకాళ్లపై నోల్చొని నిరసన తెలుపుతున్న బెంతుఒరియాలు

మెకాళ్లపై బెంతుఒరియాల నిరసన

కవిటి: బెంతు ఒరియాల గుర్తింపు, భవిష్యత్ భరోసా కోసం పోరాడుతున్న బెంతు ఒరియాలు బుధవారం మోకాళ్లపై నిల్చొని నిరసన చేపట్టారు. కవిటి బస్టాండ్‌లో చేస్తున్న ఈ రిలే నిరాహారదీక్షల్లో 57వ రోజు కొన్నాయిపుట్టుగ గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ బెంతుఒరియాలను గుర్తించే వరకు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

సిలబస్ పూర్తి చేయాలి

ఇచ్ఛాపురం : ఈ ఏడాది అకాడమిక్ కేలండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని డిప్యూటీ డిఇఒ ఆర్.విజయకుమారి ఆదేశించారు. ఎంఇఒ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సక్రమంగా ట్యాబ్‌లు పనిచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నోట్ పుస్తకాలు, రిజిస్టర్ సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంఇఒ అప్పారావు పాల్గొన్నారు.

పొందూరులో 'భవిష్యత్‌కు గ్యారంటీ'

పొందూరు: పట్టణంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న గ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు భాస్కరరావు, వాసు, మురళీ, ఆది పాల్గొన్నారు.